నేటి కందం- నేటికి అందం

పనిచేయు ప్రాంతమందున
ఘనతరమగు పటిమ జూపి గైకొనగ నతుల్
మునుకొని జరుపంగ వలయు
తనివారెడి పగిది వలస దారుల దినమున్ !!

(డిసెంబరు 18 ప్రపంచ
వలస దారుల దినం)



-రాధశ్రీ



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com



చురక

నిరసనలు నినాదాలు
నిత్యమైతే కష్టమే
చట్టసభలో చర్చలకు
చెప్పలేని నష్టమే
పార్టీ ఏదైనా కాని
ప్రజల పుష్టే ముఖ్యము
పరిష్కరించే దృష్టి ఉంటే
పట్టువిడుపే లౌక్యము



-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ బుధవారం 18-12-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:106 పేజీలు:6 వెల: రూ.1/-


## ఈ ఏడాది జూలై తర్వాత కడుతున్న అక్రమ నిర్మాణాలను కూల్చేస్తాం- రంగనాథ్

-అంతకు ముందు నిర్మాణాల జోలికి పోము
-తేల్చి చెప్పిన హైడ్రా కమిషనర్ రంగనాథ్
-అనుమతులంటే వారికి జోలికి వెళ్లం
-చెరువుల్లో.. బఫర్ జోన్లలో.. ఎఫ్ టి ఎల్ జోన్ కట్టడాలు వద్దు
-అక్కడ నిర్మాణాలుంటే కూల్చివేస్తాం
-ప్రతి సోమవారం హైడ్రా కార్యాలయంలో ప్రజావాణి
-ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తాం

హైదరాబాద్, డిసెంబర్ 17:అన్ని అనుమతులు ఉంటే ఎలాంటి ఇబ్బంది లేదని.. అలా కాకుండా చెరువుల్లో.. బఫర్ జోన్లలో.. ఎఫ్ టి ఎల్ పరిధిలో చేవడుతున్న నిర్మాణాలను కూల్చేస్తామని వార్నింగ్ ఇచ్చారు హైడ్రా కమిషనర్ రంగనాథ్.

కూకట్ పల్లిలోని కాముని చెరువు,



మైసమ్మ చెరువులను నేడు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024 జులై తర్వాత కడుతున్న అక్రమ నిర్మాణా లను కూల్చివేస్తామని చెప్పారు. హైడ్రా ఏర్పడక ముందు ఉన్న నిర్మాణాల జోలికి వెళ్లబోమన్నారు. గతంలో అనుమతులు తీసుకొని ఇప్పుడు నిర్మిస్తున్నవాటిని కూల్చబోమ న్నారు.

పర్మిషన్లు తీసుకోకుండా అక్రమం గా నిర్మించుకున్న భవనాలపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. కొత్తగా తీసుకున్న అనుమతు లను హైడ్రా తనిఖీలు చేస్తుందన్నారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా చెరువుల పరిరక్షణకు హైడ్రా పనిచేస్తుందన్నారు రంగనాథ్. పేదవాళ్లు, చిన్నవాళ్ల జోలికి హైడ్రా వెళ్లబోదన్నారు. పేదవాళ్ల ఇండ్లు హైడ్రా కూల్చివేస్తుందనే తప్పుడు ప్రచారం నమ్మొద్దని చెప్పారు

హైదరాబాద్ లో చెరువులు, కుంటలు, పార్కుల ఆక్రమణలపై ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకోవా లని హైడ్రా నిర్ణయించింది. ఈ మేరకు 2025 జనవరి నుంచి ప్రతి సోమవారం బుద్ధభవన్ లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు రంగనాథ్ తెలిపారు.. చెరువు లు,నాలాలు, పార్కుల ఆక్రమణలపై అర్జీలు ఇవ్వొచ్చని అన్నారు. ఇటీవలే చెరువులు,నాలాలు, పార్కులు కబ్జాకు గురవుతున్నట్లు హైదరాబాద్ లో హైడ్రా కమిషనర్ కు ఫిర్యాదులు వస్తున్నాయని, . ఈ క్రమంలోనే ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకునేం దకు ప్రతి సోమవారం ప్రజావాణిని నిర్వహించనున్నట్లు చెప్పారు.

## మన ఊరు - మన బడి పథకం కింది పాఠశాలలను పూర్తి చేయండి

-ప్రభుత్వానికి సూచించిన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

హైదరాబాద్ డిసెంబర్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ : గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన మన ఊరు - మన బడి పథకాన్ని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి శాసనమండలిలో ప్రస్తావించారు. మన ఊరు - మన బడి పథకం కింద మొదలుపెట్టిన పాఠశాలల బిల్లులు చెల్లించి, ఆ పాఠశాలలను పూర్తి చేయండి అని కాంగ్రెస్ ప్రభుత్వానికి గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన మన ఊరు - మన బడి పథకం కింద చాలా గ్రామాల్లో పాఠశాల భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాల్సిన అవసరం ఉంది. ఉదాహరణకు నా ఊర్లోనే మన ఊరు - మన బడి పథకం కింద జిల్లా పరిషత్ హైస్కూల్‌ను తీసుకున్నారు. స్లాబ్ వేశారు. గోడలు, కిటికీలు లేవు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం.. ఆ పథకాన్ని అమ్మ ఆదర్శ పాఠశాలలుగా మార్చింది. అసంపూర్తిగా మిగిలి ఉన్న భవనాలను పూర్తి చేస్తే బాగుండేది. కాబట్టి మీరు మన ఊరు - మన బడి పథకం కింద నిర్మించిన భవనాల కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలి. అంతేకాకుండా మిగిలి ఉన్న పనులను వీలైనంత త్వరగా పూర్తి చేస్తే బాగుంటుంది. పిల్లలు చెట్ల కింద కూర్చొనే పరిస్థితి వచ్చింది. ఎందుకంటే చాలా చోట్ల భవనాలు సగం నిర్మాణాల వద్దే ఆగిపోయాయని గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. స్పెషల్ డ్రైవ్ కింద ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొని వీటిని పూర్తి చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహా దృష్టికి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తీసుకెళ్లారు.

## 7.3 తీవ్రతతో భారీ భూకంపం.. ధ్వంసమైన భవనాలు..



న్యూఢిల్లీ, డిసెంబర్ 17: పసిఫిక్ ద్వీప దేశం వనౌటు ను భారీ భూకంపం కుదిపేసింది. దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న వనౌటు తీరంలో మంగళవారం ఉదయం అత్యంత శక్తిమంతమైన భూకంపం సంభవించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 7.3గా నమోదైంది. దేశంలోనే అతిపెద్ద నగరమైన రాజధాని పోర్ట్ విలా కు పశ్చిమాన 57 కిలోమీటర్ల లోతులో ఈ భూకంప కేంద్రాన్ని గుర్తించారు.

7.3 తీవ్రత తర్వాత ఇదే ప్రాంతంలో పలు మార్లు 5.3 తీవ్రతతో భూ ప్రకంపనలు నమోదయ్యాయి. భూకంపం ధాటికి ఎత్తైన భవనాలు ఊగిపోయాయి. అనేక భవనాలు, కార్లు దెబ్బతిన్నాయి. పోర్ట్ విలాలోని యూఎస్, యూకే, ఫ్రాన్స్ సహా పలు దేశాల రాయబార కార్యాలయాలు ఉన్న భవనం ధ్వంసమైనట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఈ భూకంపం ఘటనలో భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.

## హయత్ నగర్ లోని నారాయణ రెసిడెన్షియల్ స్కూల్లో విద్యార్థి ఆత్మహత్య

హైదరాబాద్ డిసెంబర్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూ స్: రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ లోని నారాయణ రెసిడెన్షియల్ స్కూల్లో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏడో తరగతి విద్యార్థి లోహిత్ రెడ్డి రాత్రి ఊరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఫిజిక్స్ ఉపాధ్యాయుడు క్లాస్ రూమ్ లో క్లాస్ లీడర్ తో కొట్టించడంతో పాటు ఉపాధ్యాయుడు వేధింపులకు గురి చేయడంతో విద్యార్థి మృతి చెందాడని బంధువులు ఆరోపణలు చేస్తున్నారు. విద్యార్థి మృతి చెందిన విషయం పోలీసు వారు చెప్తే కానీ తమకు తెలియలేదని ఇప్పటికి కూడా స్కూల్ యాజమాన్యం ఏం జరిగిందో చెప్పట్లేదని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థి స్వస్థలం వనపర్తి జిల్లాగా గుర్తించారు.

## 21 కిలోల గంజాయి స్వాధీనం.. ఆరుగురు అరెస్ట్

హైదరాబాద్, డిసెంబర్ 17:నూతన సంవత్సర వేడుకలకు హైదరాబాద్ మహానగరం సంసిద్ధమవుతుండగా యువకుల, వ్యాపార వర్గాల, టెక్కిల ఉత్సాహాన్ని, జోరును, హుషారును అనుకూలంగా మార్చుకుని, మహా నగరానికి పెద్ద ఎత్తున మత్తు పదార్థాలు, గంజాయిని దిగుమతి చేసుకుని, పోలీస్ ఎక్సైజ్ శాఖల దృష్టి పడకుండా నిల్వ చేయడానికి మత్తు పదార్థాల అక్రమ రవణా చేసే ముఠాలు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో ఎక్సైజ్ అధికారులు చర్యలకు పూనుకున్నారు. నగరంలో మత్తుపదార్థాల రవాణాకు అటకట్ట వేసేందుకు నిఘా పెంచారు.

ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి ప్రతి నిత్యం గంజాయి సరఫరాకు అడ్డుకట్ట వేసేందుకు తీసుకుంటున్న చర్యలను సమీక్షిస్తూ అధికారులకు ప్రత్యేక ఆదేశాలిస్తున్నారు. నూతన సంవత్సర వేడుకల్లో విక్రయించేందుకు తీసుకువచ్చిన 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో స్టేట్ టాస్క్ ఫోర్స్ అడిషనల్ ఎస్పీ భాస్కర్ నేతృత్వంలో డీఎస్పీ తులా శ్రీనివాసరావు, ఇన్ స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఒరిస్సా నుండి హైదరబాద్ లోని దూల్ పేటకు గంజాయిని తీసుకు వచ్చి నగరంలోని వివిధ ప్రాంతాలకు పంపిణీ చేయడానికి తరలిస్తున్న క్రమంలో పక్కా సమాచారంతో పకడ్బందీ వ్యూహంతో దాడులు నిర్వహించి సుమారు 21కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

దూల్ పేటకు చెందిన లకన్ సింగ్, ఇంద్రేష్ సింగ్, కైలాష్ సింగ్, శుభం సింగ్, గోల్కొండకు చెందిన ఆదిత్య సింగ్, ఒడిషాకు చెందిన జలేంద్ర హరిజన్, సురేష్ హరిజన్ లను అదుపులోకి తీసుకొని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు లకన్ సింగ్ గంజాయి అక్రమ వ్యాపారాన్ని తన ప్రధాన వ్యాపారంగా మలచుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతను గతంలో కూడా నేర చరిత్ర కలిగి పలు కేసుల్లో నిందితుడు. శుభం సింగ్ మీద కూడా గతంలో పలు కేసులున్నాయి. గంజాయి సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ హెచ్చరించారు. తనిఖీల్లో కె.వెంకటేశ్వర్లు, శివకృష్ణ, వేణు కుమార్, యూసుఫ్, మౌలా అలీ, లోకేష్, చిల్ల బాలరాజులు పాల్గొన్నారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం

– ఏపీలోని పలు జిల్లాలో మూడు రోజులపాటు వర్షాలు

అమరావతి డిసెంబర్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ద్రోణి మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ తమిళనాడు తీరం వైపు వయనిస్తోందని వివరించారు. దీని ప్రభావంతో మూడు రోజుల పాటు తమిళనాడు, ఏపీలోని( కోస్తా ( రాయలసీమ లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు.తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, నెల్లూరు, బాపట్ల, విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలకు రెయిన్ అలెర్ట్ జారీ చేసింది. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని పేర్కొన్నారు. బుధవారం తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందన్నారు.

## ఢిల్లీలో మరోసారి పడిపోయిన గాలి నాణ్యత

-గాలి నాణ్యత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్న అధికారులు

న్యూ ఢిల్లీ డిసెంబర్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఢిల్లీలో మరోసారి గాలి నాణ్యత పడిపోయింది. సోమవారం రాత్రి 10 గంటలకు గాలి నాణ్యత 400 పాయింట్లకు పడిపోయింది. దీంతో గ్రాప్ 4 ఆంక్షలు అమల్లోకి తీసుకొచ్చామని అధికారులు ప్రకటించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గాలి నాణ్యత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వెల్లడించారు. ప్రత్యేక కమిటీ ఆదేశాల మేరకు సంబంధిత రాష్ట్రాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఢిల్లీలోని లోధి రోడ్ లో ఉష్ణోగ్రత 5 డిగ్రీల కనిష్ట స్థాయికి పడిపోయిందని భారత వాతావరణ శాఖ తెలిపింది. వాహనదారులకు దృశ్యమానత తగ్గిపోవడంతో లైట్ల వెలుతురులోనే వారు ప్రయాణాలు చేస్తున్నారు. గాలి నాణ్యతలు, ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ఢిల్లీలో దట్టమైన పొగమంచు కమ్మేసింది.

## లోక్ సభలో జమిలి బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల

న్యూ ఢిల్లీ డిసెంబర్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: లోక్‌సభకు ముందుకు జమిలి బిల్లు వచ్చింది. లోక్ సభలో జమిలి బిల్లును కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టారు. లోక్‌సభలో129వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టిన సందర్భంగా జమిలి బిల్లుపై చర్చ జరుగుతోంది. జమిలి బిల్లును కాంగ్రెస్, సమాజ్‌వాదీ, టిఎంసి, డిఎంకె, శివసేన, ఎంఐఎం పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. జమిలి బిల్లు రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విరుద్ధంగా ఉందని కాంగ్రెస్ ఎంపి మనీష్ తివారీ విమర్శలు గుప్పించారు. జమిలి బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ ధ్వంసానికి బిడ్ వేస్తున్నారని ఎస్‌పి నేత ధర్మేంద్ర యాదవ్ పేర్కొన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వన్ నేషన్, వన్ ఎలక్షన్ వ్యతిరేకమన్నారు. జమిలి ఎన్నికలు నియంతృత్వానికి దారితీస్తాయని ధర్మేంద్ర పేర్కొన్నారు.జమిలి ఎన్నికలంటే రాష్ట్రాల హక్కులను దెబ్బతీయడమేనని టిఎంసి ఎంపి కల్యాణ్ బెనర్జీ మండిపడ్డారు. జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి వైరస్ లాంటివని విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం కావాల్సింది జమిలి ఎన్నికలు కాదు అని, ఎన్నికల సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గతంలో ఎన్‌జెఎసి బిల్లును కూడా ఇలాగే ఆమోదించుకున్నారని, మౌలిక స్వరూపానికి ఎన్‌జెఎసి



విరుద్ధమని సుప్రీంకోర్టు కొట్టేసిందని, జమిలి ఎన్నికల చట్టం వస్తే దానికీ అదే గతి పడుతుందని కల్యాణ్ బెనర్జీ చురకలంటించారు.

## రాష్ట్రాల మధ్య నీటి చిచ్చు కాంగ్రెస్ పుణ్యమే

-కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించిన ప్రధాని మోడీ

న్యూ డిల్లీ డిసెంబర్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. రైతుల పేరిట ఆ పార్టీ పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతుంటుందని, కానీ వారి కోసం ఏమీ చేయదని, ఇతరులనూ చేయనివ్వదని ప్రధాని మోడీ ఆరోపించారు. తూర్పు రాజస్థాన్ కాలువ ప్రాజెక్ట్ (ఇఆర్‌సిపి)లో జాప్యం కాంగ్రెస్ ఉద్దేశానికి ప్రత్యక్ష దాఖలా అని ఆయన విమర్శించారు. జైపూర్‌లోని దాడియాలో ఒక బహిరంగ సభలో ప్రధాని మోడీ ప్రసంగిస్తూ, 'తూర్పు రాజస్థాన్ కాలువ ప్రాజెక్టును కాంగ్రెస్ సుదీర్ఘ కాలం ఆలస్యం చేసింది. కాంగ్రెస్ ఉద్దేశాలకు ఇది కూడా ప్రత్యక్ష నిదర్శనం. వారు రైతుల పేరిట పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతుంటారు. కానీ, వారు రైతుల కోసం ఏమీ చేయరు, ఇతరులనూ చేయనివ్వరు' అని విమర్శించారు. రాజస్థాన్ ప్రభుత్వం ఒక ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన 'ఏక్ వర్ష్ పరిణామ్ ఉత్కర్ష్' కార్యక్రమంలో మాట్లాడిన మోడీ రూ. 46400 కోట్లు విలువ చేసే ఇంధన శక్తి, రోడ్, రైల్వేలు, నీటికి సంబంధించిన 24 ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. పార్వతి, కాళీసింధ్, చంబల్ ప్రాజెక్ట్ రాజస్థాన్‌లో 21 జిల్లాలకు సాగు నీరు, తాగు నీరు సౌకర్యం కల్పించడమే కాకుండా రాజస్థాన్, మధ్య ప్రదేశ్ రెండింటి అభివృద్ధిని వేగిరపరుస్తుందని ప్రధాని తెలియజేశారు. చర్చలను ప్రోత్సహించడం బిజెపి విధానం కాగా, కాంగ్రెస్ రాష్ట్రాల మధ్య నీటి వివాదాలను ప్రోత్సహిస్తూనే ఉందని ఆయన చెప్పారు. 'బిజెపి విధానం చర్చలే, సంఘర్షణ కాదు. మేము సహకారాన్ని విశ్వసిస్తాం, ప్రతికూలతను కాదు. మాకు పరిష్కారాలపై నమ్మకం ఉంది, అవరోధాలపై కాదు. అందువల్ల మా ప్రభుత్వం తూర్పు రాజస్థాన్ కాలువ ప్రాజెక్టును ఆమోదించి, విస్తరించింది కూడా. మధ్య ప్రదేశ్, రాజస్థాన్‌లలో బిజెపి ప్రభుత్వాలు ఏర్పడిన వెంటనే పార్వతి కాళీసింధ్ చంబల్ ప్రాజెక్టుపై ఒప్పందం కుదుర్చుకోవడమైంది' అని మోడీ తెలిపారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు నర్మద నీటిని సరఫరా చేసేందుకు భారీ ప్రచారోద్యమాన్ని ప్రారంభించానని ప్రధాని మోడీ తెలియజేశారు. దానిని నిలువరించేందుకు కాంగ్రెస్, కొన్ని ఎన్‌జిఇలు రకరకాల ఎత్తుగడలు వేశాయని ఆయన ఆరోపించారు.'కాంగ్రెస్ నీటి సమస్యలు తగ్గించాలని ఎన్నడూ కోరుకోదుడ మన నదుల జలాలు సరిహద్దుల పొడుగునా ప్రవహిస్తుంటాయి, కానీ మన రైతులు వాటి ప్రయోజనాల పొందలేదు. ఒక పరిష్కారం కనుగొనడానికి బదులు కాంగ్రెస్ రాష్ట్రాల మధ్య జల వివాదాలను ప్రోత్సహిస్తూనే ఉంది' అని ఆయన చెప్పారు. ఎన్నికలు జరిగిన వివిధ రాష్ట్రాల్లో బిజెపి భారీగా ప్రజల మద్దతు పొందుతున్నదని కూడా ప్రధాని మోడీ తెలిపారు. 'బిజెపి ఒక రాష్ట్రం తరువాత మరొక రాష్ట్రంలో భారీగా ప్రజల మద్దతు పొందుతున్నది. లోక్‌సభలో వరుసగా మూడవ విడత దేశానికి సేవ చేసే అవకాశాన్ని బిజెపి దేశం ఇచ్చింది. గడచిన 60 ఏళ్లలో దేశంలో ఇది సంభవించలేదు' అని మోడీ చెప్పారు. 'ప్రస్తుతం బిజెపి డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు సుపరిపాలనకు చిహ్నంగా మారుతున్నాయి. బిజెపి ఏ తీర్మానం చేసినా దానిని నెరవేర్చేందుకు నిజాయతీగా కృషి చేస్తుంటుంది. ఇప్పుడు దేశ ప్రజలు బిజెపి సుపరిపాలనకు గ్యారంటీ అని అంటున్నారు' అని ఆయన పేర్కొన్నారు. రాజస్థాన్‌లో ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ సారథ్యంలోని బిజెపి ప్రభుత్వం కృషిని కూడా మోడీ కొనియాడారు.

## జమిలి బిల్లుకు టీడీపీ మద్దతు.. జేపీసికి పంపుతామన్న అమిత్ షా



న్యూఢిల్లీ, డిసెంబర్ 17: లోక్‌సభలో ప్రవేశపెట్టిన జమిలి ఎన్నికల బిలుకు తెలుగుదేశం పార్టీ మద్దతు పలికింది. దేశవ్యాప్తంగా నిర్వహించే ఎన్నికల విధానం సరళీకృతం అవుతుందని టీడీపీ పేర్కొన్నది. కేంద్ర కమ్యూనికేషన్స్ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. జమిలి ఎన్నికల నిర్వహణ ద్వారా ఖర్చు తగ్గుతుందన్నారు. ఓటర్ల సంఖ్య కూడా పెరుగుతుందన్నారు. దేశవ్యాప్తంగా ఎన్నికల నిర్వహణ ద్వారా సుమారు లక్ష కోట్లు ఖర్చు అవుతుందని, అయితే జమిలి నిర్వహణతో ఆ ఖర్చు తగ్గే ఛాన్సు ఉందన్నారు. ఏకనాథ్ షిండే వర్గానికి చెందిన శివసేన పార్టీ కూడా బిల్లుకు మద్దతు ఇచ్చింది.

జమిలి బిల్లు కేంద్ర క్యాబినెట్ ముందు చర్చకు వచ్చిన సమయంలో.. ఆ బిల్లును పార్లమెంట్ స్థాయి సంఘానికి పంపాలని ప్రధాని మోదీ సూచన చేసినట్లు కేంద్ర మంత్రి అమిత్ షా తెలిపారు. బిల్లును ఉపసంహరించుకోవాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్న సమయంలో.. కేంద్ర మంత్రి షా ఈ వ్యాఖ్యలు చేశారు. ఐయూఎంఎల్ నేత ఈటీ మొహమ్మద్ బషీర్, ఆర్ఎస్పీ ఎంపీ ఎన్కే ప్రేమచంద్రన్.. బిల్లును వ్యతిరేకించారు.

## మనోజ్ కంప్లైయింట్‌లో నిజం లేదు.. పహాడి షరీఫ్ పోలీసులకు మంచు నిర్మలా దేవి లేఖ

హైదరాబాద్, డిసెంబర్ 17:। మంచు మోహన్ బాబు ఫ్యామిలీ వార్ ఇటు సినీ, అటు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. తండ్రీ కొడుకులు (మంచు మనోజ్, మంచు మోహన్‌బాబు) ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకుంటున్నారు. పోలీస్ కంప్లైయింట్లు ఇచ్చుకుంటున్నారు. తన తల్లి నిర్మలా దేవి బర్త్‌డే పార్టీ శనివారం రాత్రి జరుగుతుండగా.. మంచు విష్ణుకి చెందిన మనుషులు జనరేటర్‌లో పంచదార పోశారంటూ మంచు మనోజ్ ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై నిర్మలా దేవి తాజాగా స్పందించారు.

మంచు మనోజ్ ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు వివరణ ఇస్తూ పహాడి షరీఫ్ పోలీసులకు మంచు నిర్మలా దేవి లేఖ రాశారు. డిసెంబర్ 14వ తేదీన తన పుట్టినరోజు సందర్భంగా విష్ణు జల్‌పల్లి నివాసానికి వచ్చాడని తెలిపారు. తనతో కేక్ కట్ చేయించి బర్త్‌డే సెలబ్రేట్ చేసినట్లు చెప్పారు. విష్ణు ఎలాంటి దౌర్జన్యానికీ పాల్పడలేదని స్పష్టం చేశారు. మనోజ్ ఇచ్చిన కంప్లైయింట్‌లో నిజం లేదన్నారు. విష్ణు తన పుట్టిన రోజును సెలబ్రేట్ చేసి.. తన గదిలోని సామాను తీసుకొని వెళ్లిపోయినట్లు వివరించారు. అంతకు మించి అక్కడ ఎలాంటి గొడవా జరగలేదని మంచు నిర్మలా దేవి లేఖలో స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ లేఖ చర్చనీయాంశంగా మారింది.

# లఘు చెర్ల రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై బీఆరెస్ ఆందోళన



కరీంనగర్, డిసెంబర్ 17: బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు లఘు చెర్ల రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం తీరును నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనబాట పట్టాయి. కరీంనగర్ నగర బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చల్ల హరిశంకర్ గారి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జివి రామక్రిష్ణ రావు ముఖ్యఅతిథిగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం లగుచర్ల రైతుల పై కేసులు ఎత్తివేసి వెంటనే విడుదల చేయాలంటూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా రాజ్యాంగాన్ని కాలరాస్తోందన్నారు. జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు జివి.రామ కృష్ణ రావు గారు మాట్లాడుతూ దళిత గిరిజనులు రాజ్యాంగ వ్యతిరేక చర్యల వల్ల తీవ్రంగా అణిచివేతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద దళిత గిరిజన రైతులు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములను బలవంతంగా లాక్కొని వారిని రోడ్డున పడేసే కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్ లోని అగచర్లలో పేద రైతన్నల భూములను బలవంతంగా లాక్కునేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. ఓసారి ఫార్మా విలేజ్ అని, మరోసారి ఇండస్ట్రియల్ కారిడార్ అని, మాయమాటలతో రైతన్నల భూములను లాక్కొని అదానికి, తన అల్లుడికి అప్పచెప్పేందుకు కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములను ఇవ్వమని తమ జీవనాధారాన్ని లాక్కోవద్దని ప్రభుత్వానికి పది నెలలుగా విజ్ఞప్తి చేసినపట్టించుకోకుండా నిరంకుశంగా, పాసవికంగా పేద రైతన్నల పైన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను దృష్టికి తీసుకువస్తున్నామని, కొడంగల్ నియోజకవర్గం తన జాగీరుగా భావిస్తూ తన సోదరులతో పేద బడుగు బలహీన దళిత గిరిజన రైతుల పైన చేస్తున్న అరాచకాలను, అణచివేతను, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు పోలీసులు చేసిన థర్డ్ డిగ్రీ టార్చర్ ను మీ దృష్టికి తీసుకువస్తున్నామన్నారు. అక్రమ కేసులు పెట్టి అన్యాయంగా రైతన్నలను జైలులో పెట్టి, రైతన్న చేతులకు బేడీలు వేసిన రాజ్యాంగ వ్యతిరేక చర్యలను, పోలీసుల అణిచివేతను వేధింపుల నుండి వారిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, వారిపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించి, రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అమానవీయ, అణిచివేత విధానాలకు నిరసనగా రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే విడుదల చేయాలని, రైతన్నల కుటుంబాలను వేధించడం హింసించడం ఆపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి సద్బుద్ధిని ప్రసాదించాలని, ప్రభుత్వానికి జ్ఞానోదయం కలిగించాలని రాజ్యాంగ నిర్మాత అయిన మీకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో

మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు బండారి వేణు, కంసాల శ్రీనివాస్, గందె మాధవి, మహేష్, జంగిలి సాగర్, దిండిగాల మహేష్, కరీంనగర్ రూరల్ మండల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్,నగర బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు దీకొండ కుల్దీప్ వర్మ, నగర బిఆర్ఎస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు షౌకత్, బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ యూత్ కార్యదర్శి గంగాధర చందు, బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు బిఆర్ఎస్ పార్టీ డివిజన్ ఇంచార్జీలుబిఆర్ఎస్ పార్టీ నాయకులు, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# శబరిమలలో ఫ్లైవోవర్ పైనుంచి దూకిన భక్తుడు.. ఆస్పత్రికి తరలిస్తుండగా గుండెపోటు

హైదరాబాద్, డిసెంబర్ 17: శబరి కొండపైగల అయ్యప్ప దేవస్థానం లో అపశృతి చోటుచేసుకుంది. ఓ 40 ఏళ్ల భక్తుడు ఉన్నట్టుండి ఫ్లైవోవర్ పైనుంచి కిందకు దూకాడు. ఈ ఘటనలో అతని కాలు, చెయ్యి విరిగింది. దాంతో అతడిని హుటాహుటిన దేవస్థానంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పంపా ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు.

అక్కడి నుంచి వైద్యుల సూచన మేరకు మరిన్ని వైద్య పరీక్షలు చేయించేందుకు కొట్టాయంలోని మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలిస్తుండగా గుండెపోటు వచ్చి అతడు మరణించాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. మృతుడు కర్ణాటకలోని రామనగర జిల్లాకు చెందిన కుమార్‌గా గుర్తించారు. నిందితుడికి మానసిక వైకల్యం ఏమైనా ఉందా అనే కోణంలో ఎంక్వైరీ చేస్తున్నారు.

# ఇందిరమ్మా కమిటీలను వెంటనే రద్దు చెయ్యాలి

## -పార్టీలకతీతంగా పేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందించాలి
## -కేంద్ర ప్రభుత్వం ఇచ్చినటువంటి ఇళ్లను మాయం చేసిన మాజీ ముఖ్యమంత్రి
## -భారతీయ జనతా పార్టీ భీమదేవరపల్లి మండల అధ్యక్షులు పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్ ...

కరీంనగర్, డిసెంబర్ 17: (నేటినిజం ప్రతినిధి) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నా ఇందిరమ్మా ఇల్లు. పార్టీల కతీతంగా నిష్పక్షపాతంగా అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు అందించాలని భీమ్ దేవరపల్లి బిజెపి మండల అధ్యక్షులు పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్ డిమాండ్ చేశారు. భీమదేవరపల్లి మండలంలో అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందాలని గత ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం ఆవాస్ యోజన పథకంలో బాగంగా తెలంగాణకు 2 లక్షల ఇళ్లను మంజూరు చేస్తే, కనీసం బి.ఆర్.ఎస్ రాష్ట్ర ప్రభుత్వం వాటి ని నిర్లక్ష్యం చేసిందన్నారు.,ప్రస్తుత తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కొనసాగిస్తామని, ఇందిరా గాంధీ జపం చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఆవాస్ యోజన పథకం ఇళ్లను ఇందిరమ్మ ఇళ్లగా నామకరణం చేయడానికి సిగ్గుండాలాన్నారు. ఇందిరమ్మ ఇల్లు అర్హులందరికీస్తామని ప్రకటించి , నేడు ఇందిరమ్మ ఇళ్ల కమిటీ పేరిట రాజకీయ డ్రామాలు చేస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి పేదవారికి ఇల్లు అందించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేస్తున్నట్టు కనబడడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో నిరుపేద అర్హులైన పేదలకు ఇల్లులు కలగానే మిగిలే పరిస్థితి కనబడుతుందన్నారు.



రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను రద్దు చేసి ప్రభుత్వ అధికారుల ఆధీనంలోనే అర్హులైన పేదలను గుర్తించి ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందించేలా చూడాలని భీమదేవరపల్లి భారతీయ జనతా పార్టీ మండల శాఖ పక్షాన డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు.

# కేంద్ర మంత్రి జయశంకర్‌కు ఎంపీ ధర్మపురి అరవింద్ లేఖ

నిజామాబాద్, డిసెంబర్ 17:దుబాయ్ లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులను భారత్ కు రప్పించాలని కేంద్ర మంత్రి జయశంకర్ ను ఎంపీ ధర్మపురి అరవింద్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంపీ ధర్మపురి అరవింద్ కేంద్ర మంత్రి జయశంకర్ కు లేఖ రాశారు.

దుబాయిలో రెండు రోజుల క్రితం జరిగిన బస్సు ప్రమాదంలో భారత్ కు చెందిన కార్మికులు తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. దుబాయ్ లోని ధర్వేష్ కంపెనీలో పనిచేసే 75 మంది కార్మికులు అజ్మన్ నుండి ఖోర్ ఫక్కన్ కు బస్సులో వెళ్తుండగా ఆకస్మాత్తుగా బ్రేకులు ఫెయిల్ అయి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటన పలువురి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపిందని వాపోయారు. క్షతగాత్రుల్లో భారతదేశానికి చెందిన వారిని వెంటనే రప్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

# లగచర్ల గిరిజన రైతులను వెంటనే విడుదల చేయాలి.. దాసోజు శ్రవణ్ డిమాండ్

హైదరాబాద్, డిసెంబర్ 17: రాక్షస ఆనందం పొందుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. లగచర్ల గిరిజన రైతుల విడుదలకు వెంటనే చర్యలు తీసుకోవాలి అని బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ బీఆర్ఎస్ శ్రేణులు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి, లగచర్ల గిరిజన రైతుల అక్రమ నిర్బంధాన్ని తీవ్రంగా ఖండించారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ.. లగచర్ల గిరిజన రైతులను అక్రమంగా జైలులో నిర్బంధించి, థర్డ్ డిగ్రీలు ప్రయోగించి రాక్షస ఆనందం పొందుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని అవమానించే చర్య అని తీవ్రస్థాయిలో విమర్శించారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోర్టులను కూడా తప్పుదోవ పట్టిస్తూ గిరిజన రైతులకు అవసరమైన బెయిల్ రాకుండా అవరోధాలు సృష్టిస్తోంది. రైతులను జైళ్లలో ఉంచి అన్యాయంగా ఇబ్బందులు పడేలా చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వ తీరును తాము తీవ్రంగా ఖండిస్తున్నాం. అంతేకాక, ఈ అత్యంత కీలకమైన అంశంపై అసెంబ్లీలో చర్చకు కూడా అనుమతించకపోవడం దురభిమానం అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సహా లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని, వారి విడుదల కోసం తక్షణ చర్యలు చేపట్టాలని దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. రైతన్నల హక్కులను రక్షించడం ప్రభుత్వ బాధ్యత, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విలువలతో ప్రభుత్వాలు ముందుకు సాగాలి. లగచర్ల ఘటనలో నిరంకుశ విధానాలకు పాల్పడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పార్టీ నిలదీస్తుంది అని శ్రవణ్ స్పష్టం చేశారు.

# మహిళ రక్షణ ప్రథమ బాధ్యత

## -జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
## - పోలీస్ స్టేషన్లో పోలీస్ అక్క కార్యక్రమానికి శ్రీకారం

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 17: (నేటినిజం ప్రతినిధి): సిరిసిల్ల పట్టణ పరిధిలోని పద్మనాయక కల్యాణ మండపంలో జిల్లా షీ టీమ్



ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "పోలీస్ అక్కా" కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూజిల్లాలో మహిళా రక్షణకు ప్రథమ బాధ్యతగా తీసుకుంటూ మహిళ రక్షణయే దెయ్యంగా జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో విన్నూత కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అందులో భాగంగానే "పోలీస్ అక్క" పేరుతో జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ కానిస్టేబుల్ ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ పోలీస్ అక్కగా ఎన్నిక కాబడిన వారు షీ టీమ్ కి సహాయకంగా ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని అన్ని పాఠశాలలు, కళాశాలలను సందర్శిస్తూ విద్యార్థులకు పొక్సో యాక్ట్, సెక్సువల్ హేర్స్మెంట్, ఈవ్ టీసింగ్,గుడ్ టచ్ బ్యాడ్ టచ్, మహిళ చట్టాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటుగా విద్యార్థులకు సమస్యలు ఎదురైనప్పుడు వారు సంప్రదించే విధంగా షీ టీమ్, డయల్ 100, పోలీస్ అక్క నంబర్లు ఆయా పాఠశాలల్లో, కళాశాలల్లో ఏర్పాటు చేయాలన్నారు.

విద్యార్థిని విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, సోషల్ మీడియాలో వేదికగా విద్యార్థినుల పట్ల వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. మహిళలు, విద్యార్థినులు వేధింపులకు గురైతే నిర్భయంగా జిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 కు పిర్యాదు చేసినచో వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

జిల్లాలో ఏర్పాటు చేసిన షీ టీం విద్యార్థులమహిళల సమస్యలపై వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ ఈ సంవత్సరం 52 మంది ఆకతాయిలను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోవడం జరిగిందని, ఈ సంవత్సరం మహిళలను, విద్యార్థులను వేధిస్తున్న వారిపై 60 పెట్టి కేసులు,44 ఎఫ్ఐఆర్ లు నమోదు చేయడం జరిగిందన్నారు

పోలీస్ స్టేషన్ల వారిగాపోలీస్ అక్కగా కె సరస్వతి (సిరిసిల్ల), ఎస్ సుజాత (తంగళ్లపల్లి) జె మంజుల (ముస్తాబద్), ఎం ప్రవళిక (ఇల్లంతకుంట), బి రోజా (ఎల్లారెడ్డిపేట), బి శిరీష (గంభీరవుపేట), కె స్వప్న (వీర్నపల్లి), లత (వేములవాడ), ఎన్ రేణుక (వేములవాడ రూరల్), పింకల్ యాదవ్ (బోయినిపల్లి), హెచ్ శ్రీవెన్నెల (చందుర్తి), శాండీ (కొనరావుపేట), జి అమల (రుద్రంగి) ఎంపికయ్యారు.

ఈ కార్యక్రమంలో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిఐ కృష్ణ, ట్రెని ఎస్ఐ వీనిత, షీటీం ఏఎస్ఐ ప్రమీల, షీ టీమ్ సిబ్బంది, పోలీస్ అక్కగా ఎన్నిక కాబడిన మహిళ కానిస్టేబుల్, విద్యార్థులు పాల్గొన్నారు.

# నార్త్ సిటీ మెట్రో సాధనకు సమితి మరో అడుగు

## -మేడ్చల్ మెట్రో సాధనలో క్రియాశీలక ప్రణాళికలు
## -వినూత్న కార్యక్రమాలకు కార్యాచరణ

హైదరాబాద్, డిసెంబర్ 17: నార్త్ సిటీ మెట్రో సాధనలో మేడ్చల్ మెట్రో సాధన సమితి కీలక నిర్ణయం తీసుకున్నది. నార్త్ సిటీకి మెట్రో నిర్మాణమే లక్ష్యంగా స్థానిక కమ్యూనిటీలను భాగస్వామ్యం చేసేలా కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా మేడ్చల్ సాధన సమితి ఆధ్వర్యంలో స్థానికంగా ఉండే కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లను కలుపుకొని ఉద్యమ కార్యాచరణ వైపు అడుగులు వేస్తున్నది. ప్రస్తుతం ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన రాలేదు. దీంతో పాటు సెకండ్ ఫేస్-2లోనూ నార్త్ సిటీలోని ప్రతిపాదిత ప్రాంతాలను చేర్చలేదు. ఇలా తమ ప్రాంతానికి మెట్రో అంశంలో సీఎం రేవంత్‌రెడ్డి మొండిచేయి చూపుతున్నారు. ఒకసారి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం పూర్తయితే.. భవిష్యత్‌లో మెట్రో ప్రాజెక్టు నిర్మాణం అసాధ్యమని స్థానికులు భావిస్తున్నారు. దీనికోసం స్థానికులను భాగస్వామ్యం చేస్తూ మేడ్చల్ మెట్రో సాధన సమితి డిజిటల్ మాధ్యమాలు, స్థానికంగా కమ్యూనిటీలను ఏర్పాటు చేసుకుంటూ ఆ ప్రాంతానికి మెట్రో ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తోంది.

మేడ్చల్, శామీర్‌పేట వరకు మెట్రో నిర్మాణమే లక్ష్యంగా మేడ్చల్ మెట్రో సాధన సమితి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నది. నార్త్‌సిటికి మెట్రో సాధన ప్రాముఖ్యతను వివరిస్తూ ఇప్పటికే పలు కార్యక్రమాలు, నిరసనలు, ఆందోళనలను చేపట్టింది. తాజాగా మేడ్చల్ మెట్రో సాధన సమితి ఆధ్వర్యంలో కాలనీకొక కమ్యూనిటీని ఏర్పాటు చేస్తోంది. ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు, జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు ఉన్న కాలనీ వాసులను కలుపుకొంటున్నది. కమ్యూనిటీ బిల్డప్ పేరిట ఇంటింటికీ నార్త్ సిటీ మెట్రో ఉద్యమాన్ని తీసుకెళ్లడంలో భాగమని మెట్రో సాధన సమితి నిర్వాహకులు చెబుతున్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి ఎంపీగా రేవంత్‌రెడ్డి గెలిచిన తర్వాత? ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పునర్జీవం పోసిన నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సౌకర్యాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తానన్నారు.

కానీ సీఎం అయ్యాక ఈ ప్రాంతానికి అత్యంత అవసరమైన మెట్రో నిర్మాణంలో మొండి చేయి చూపారు. ఫేస్-2లో భాగంగా నగరంలో 76.4 కిలోమీటర్ల మేర మెట్రో లైన్లను నిర్మించేందుకు డీపీఆర్ సిద్ధం చేసింది. కానీ ఎన్నో ఏండ్లుగా పోరాడుతున్నా స్థానికుల ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోకుండానే అలైన్‌మెంట్లను ప్రకటించింది. ఇందులో నార్త్ సిటీని పరిగణనలోకి తీసుకోలేదు. కేవలం రైట్ ఆఫ్ వే లేదనే సాకుతో మేడ్చల్ ప్రాంతానికి మెట్రోను దూరం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని స్థానికులు వాపోతున్నారు.

# మహీంద్రా విశ్వవిద్యాలయంలో 'స్కూల్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్' ప్రారంభం




హైదరాబాద్, డిసెంబర్ 17: మహీంద్రా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'స్కూల్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్' ప్రారంభమైంది. ఈ స్కూల్లో కలినరీ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌లో బీఎస్సీ (హానర్స్) కోర్సును అందుబాటులోకి తెచ్చింది. ఆధునిక హాస్పిటాలిటీ రంగంలో ప్రత్యేక నైపుణ్యాలతో విద్యార్థులను సిద్ధం చేయడమే లక్ష్యంగా ఈ కోర్సు రూపొందించబడింది. సంప్రదాయ నైపుణ్యాలు, ఆధునిక సాంకేతికత కలయికతో గ్లోబల్ ప్రొఫెషనల్స్‌ను తీర్చిదిద్దడానికి ఈ కోర్సు దోహదపడనుంది.

60 సీట్లతో మొదటి బ్యాచ్ 2025 ఫిబ్రవరిలో ప్రారంభమవుతుంది. అడ్మిషన్లు జనవరిలో ప్రారంభం కానున్నాయి. 80 శాతం స్కోర్‌తో ఏదైనా బోర్డు నుంచి 10+2 తర్వాత విద్యార్థులు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఎన్సీహెచ్ఎంసీటీ, జేఈఈ ప్రవేశ పరీక్ష స్కోర్ ద్వారా లేదా మహీంద్రా యూనివర్శిటీ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ ఎంట్రన్స్ టెస్ట్-2025 (ఎంయూహెచ్ఈటీ 2025)కి అర్హత సాధించడం ద్వారా ప్రవేశాన్ని పొందవచ్చు. విద్యార్థులు [illegible] చేసుకోవచ్చు. ఈ సందర్భంగా మహీంద్రా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ యాజులూ మెదూరి మాట్లాడుతూ ఈ స్కూల్ ఆఫ్ హాస్పిటాలిటీ మా అత్యాధునిక ప్రోగ్రామ్‌ల పోర్ట్‌ఫోలియోకు ఒక అద్భుతమైన జోడింపు అన్నారు.

ఈ స్కూల్ విద్యార్థులకు మారుతున్న తాజా ట్రెండ్స్, టెక్నాలజీపై ప్రావీణ్యం కలిగించేందుకు కృషి చేస్తుందన్నారు. ప్రసిద్ధ ఫ్యాకల్టీ ద్వారా విద్యార్థులు మాస్టర్ క్లాసులు,

ఇంటరాక్టివ్ వర్క్‌షాప్‌లు, వాస్తవిక అనుభవంతో అత్యుత్తమ విద్యను పొందుతారన్నారు. ఈ సందర్భంగా మహీంద్రా విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ డీన్ చెఫ్ కె తిరుజ్ఞానసంబంతం మాట్లాడుతూ ఈ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలు, వ్యూహాత్మక ఆలోచన శక్తితో కూడిన సమగ్ర నైపుణ్యాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రోగ్రామ్ విద్యార్థులలో కలినరీ నైపుణ్యాలు మాత్రమే కాకుండా నాయకత్వం, వ్యాపారత్మక ఆలోచన, స్థిరమైన అభ్యాసాలను పెంపొందించేలా ఉంటుందన్నారు. స్కూల్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ ప్రపంచంలోని అత్యంత ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలతో భాగస్వామ్యాన్ని కలిగి ఉంది. వీటిలో వర్జీనియా టెక్, యూనివర్సిటీ ఆఫ్ హ్యూస్టన్‌లోని కాన్రాడ్ ఎన్. హిల్టన్ కాలేజ్ ఆఫ్ గ్లోబల్ హాస్పిటాలిటీ లీడర్‌షిప్, స్విస్ హోటల్ మేనేజ్‌మెంట్ స్కూల్, సెసార్ రిట్జ్ కాలేజెస్, కలినరీ ఆర్ట్స్ అకాడమీ, స్విట్జర్లాండ్ ప్రముఖంగా ఉన్నాయి. మహీంద్రా హాలిడేస్, క్లబ్ మహీంద్రా వంటి దేశంలోని అత్యంత ప్రఖ్యాత హాస్పిటాలిటీ బ్రాండ్‌లతో భాగస్వామ్యం కలిగి ఉంది. ఇవి విద్యార్థులకు పరిశ్రమపై అవగాహన, ప్రత్యక్ష శిక్షణ అందిస్తాయి. భారతదేశ హాస్పిటాలిటీ, కలినరీ రంగం సంవత్సరానికి సుమారు 250 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని సాధిస్తుంది.

ఇది దేశ జీడీపీలో 7.5 శాతం వాటాను కలిగి ఉంది. దేశ, విదేశీ టూరిజం వల్ల ఈ పరిశ్రమ 2033 నాటికి పది మిలియన్లకు పైగా కొత్త ఉద్యోగాలను సృష్టించనుంది. ఈ రంగం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తూ, ఉద్యోగావకాశాలు, వ్యాపారత్మక అవకాశాలు, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుంది.

# ఊబకాయానికి స్వస్తి పలకండి- బారియాట్రిక్ శస్త్రచికిత్సతో ఉపశమనం



హైదరాబాద్, డిసెంబర్ 17: ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన అనారోగ్య సమస్యగా ఊబకాయం మారిందని అమికస్ స్పెషాలిటీ క్లినిక్ (హైదరాబాద్) సీనియర్ లాపరోస్కోపిక్, బారియాట్రిక్ సర్జన్ డాక్టర్ వేణు గోపాల్ పరీక్ తెలిపారు. అధిక బరువు (ఒబెసిటీ) అనేది శరీరంలో అధిక కొవ్వు కారణంగా కలిగే పరిస్థితి అన్నారు. ఇది కేవలం దేహ సౌందర్యానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదని, గుండె, మధుమేహం, అధిక రక్తపోటు, కొన్ని రకాల కాన్సర్ ప్రమాదాన్ని పెంచనుందని తెలిపారు. ఒబెసిటీకి కారణాలు బహుముఖంగా ఉన్నాయన్నారు. జన్యుపరమైన అంశాలు, సరైన ఆహారం, శారీరక శ్రమ లేకపోవడం కారణాలుగా చెప్పవచ్చన్నారు. మానసిక ఒత్తిడి, భావోద్వేగాల కారణంగా వచ్చే ఆహారపు అలవాట్లు, హార్మోన్ల అసమతుల్యతలు కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఆహారం, వ్యాయామం, ప్రవర్తనలో మార్పులు కొంతమందికి ప్రభావవంతంగా ఉంటాయన్నారు. తీవ్రమైన స్థూలకాయంతో ఉన్న వారికి ఇవేమీ సరిపోవన్నారు. అప్పుడు బారియాట్రిక్ శస్త్రచికిత్స ఒక పరిష్కారంగా చెప్పవచ్చన్నారు. బారియాట్రిక్ శస్త్రచికిత్సతో జీర్ణక్రియ వ్యవస్థను మార్చి, ఆహారం తీసుకునే పరిమాణాన్ని తగ్గిస్తారని తెలిపారు. ఇది బరువు తగ్గడానికి అవకాశం కల్పిస్తుందన్నారు. ఈ విధానం వల్ల టైప్ 2 మధుమేహం వంటి స్థూలకాయానికి సంబంధించిన అనారోగ్య సమస్యలను అధిగమించవచ్చని తెలిపారు. బారియాట్రిక్ శస్త్రచికిత్స ప్రయోజనాల్లో ప్రధానంగా టైప్ 2 మధుమేహంపై దీని ప్రభావం అన్నారు. బరువు తగ్గక ముందే.. శస్త్రచికిత్స తర్వాత కొన్ని రోజులు లేదా వారాల్లోనే మధుమేహం రిమిషన్ జరగడం అనేక అధ్యయనాల్లో తేలిందని తెలిపారు. ఇది ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడం, రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించే మెటబాలిక్ మార్పుల కారణంగా జరుగుతుందని పేర్కొన్నారు. ఈ శస్త్రచికిత్స కేవలం బరువు తగ్గించడమే కాకుండా జీవనశైలిని పూర్తిగా మారుస్తుందన్నారు. రోగులు జీవన నాణ్యత, మానసిక ఆరోగ్యంలో మెరుగుదల ఉంటుందన్నారు. రక్తపోటు, నిద్ర సమస్యలు, మోకాళ్ల నొప్పులు వంటి వ్యాధులు తగ్గడంతో దీర్ఘకాలిక ఆరోగ్య ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. ఇది వ్యక్తులకు చురుకైన, ఆరోగ్యవంతమైన జీవనశైలికి అవకాశం ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా ఒక రోగి అనుభవాన్ని చెప్పాలనుకుం టున్నారు. ఎందుకంటే, నా సలహాతో ఆయన జీవితం మారిందన్నారు. ఇప్పుడు ఎంతో సంతోషంగా జీవనం సాగిస్తున్న ఆయన గురించి.. 'ఆయన వయస్సు 64 సంవత్సరాలు, అనేక సంవత్సరాలుగా ఊబకాయం, అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు.

# రికార్డు స్థాయి డిమాండ్‌కు అనుగుణంగా సమ్మర్ యాక్షన్ ప్లాన్

## -క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

హైదరాబాద్, డిసెంబర్ 17: గ్రేటర్ పరిధిలో విద్యుత్ డిమాండ్ వినియోగం, గతేడాది వేసవితో పోల్చుకుంటే గణనీయంగా పెరగనుందని అధికారులు అంచనా వేశారు. గతేడాది 3756 మెగావాట్లుగా ఉన్న గరిష్ఠ డిమాండ్ ఈ ఏడాది దాదాపు 16 శాతం వృద్ధితో 4352 మెగావాట్లుగా నమోదైంది.

గతేడాది 81.39 మిలియన్ యూనిట్లుగా ఉన్న వినియోగం దాదాపు 12 శాతం వృద్ధితో 90.68 మిలియన్ యూనిట్లకు చేరింది.

రాబోయే 2025 వేసవిలో సైతం విద్యుత్ డిమాండ్ గతం కంటే ఎక్కువగా రికార్డు స్థాయిలో గణనీయంగా వృద్ధి నమోదు అవుతుందని అంచనా వేశారు. డిమాండ్ ఎంత పెరిగినా సరఫరాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలనే ప్రభుత్వ ఆదేశానుసారం, విద్యుత్ సంస్థల యాజమాన్యాలు, అధికారులు సిబ్బంది సెక్షన్ స్థాయిలో డిమాండ్‌ను మదింపు చేస్తూ తగు ఏర్పాట్లు చేసే పనుల్లో నిమగ్నం అవుతున్నట్లు చెప్పారు.

రానున్న వేసవిలో పెరగనున్న డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ సరఫరాకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ తగు చర్యలు చేపట్టింది.

సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వేసవి సన్నాహక చర్యల్లో భాగంగా జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. మేడ్చల్ పరిధిలో బౌరంపేట్‌లో నిర్మితమవుతున్న 132 కేవీ సబ్‌స్టేషన్‌ను, టవర్ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. అలాగే బౌరంపేట 33/11కేవీ సబ్ స్టేషన్‌లో అదనంగా ఏర్పాటు చేసిన 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు.

గ్రేటర్ హైదరాబాద్ నగరంలో వేసవి సన్నాహక చర్యల్లో భాగంగా చేపట్టిన పనుల్లో హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ పరిధిలో 35, 11 కేవీ ఫీడర్ల విభజన, ఇంటర్లింకింగ్, 149 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థాయి పెంపు, అదనంగా ఏర్పాటు చేయనున్నారు.

హబ్సిగూడ సర్కిల్ పరిధిలో 90, 11 కేవీ ఫీడర్ల విభజన, ఇంటర్లింకింగ్, 14, 33 కేవీ ఫీడర్ల విభజనతో పాటు తదితర సర్కిల్ పరిధిలో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థాయి పెంపు, అదనంగా ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

విద్యుత్ డిమాండ్‌లో భారీ పెరుగుదలకు అవకాశమున్న రంగారెడ్డి జోన్ల పరిధిలో 254, 11 కేవీ ఫీడర్ల విభజన, ఇంటర్లింకింగ్, 1252 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థాయి పెంపు,అదనంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీ ఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజినీర్ మేడ్చల్ అట్లూరి కామేశ్, ట్రాన్స్‌కో చీఫ్ ఇంజినీర్ వై.చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.